**ఈ వారం కథ**

# లవ్ 2020

**కాసుల ప్రతాపరెడ్డి**

**నువ్వు ఎప్పుడూ ఎవర్నీ ప్రేమించలేదా? అని అడిగింది వసుంధర.**

**నేను చాలా మందిని ప్రేమించాను. నన్నెవరైనా ప్రేమించారో లేదో తెలీదో అన్నాడు సీతారాం.**

**అంత తెలియకుండా ఉంటుందా? అని అడిగింది ఆసక్తిగా.**

ఇద్దరూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ మీద పచ్చని తివాచీలా ఉన్న పచ్చికపై కూర్చుని ఉన్నారు. ఆమెది చామన ఛాయ. కానీ, అణువణువునా ఆకర్షణ తొణికిసలాడుతుంది. అతను మాట్లాడలేదు.

అమ్మాయిలతో సాన్నిహిత్యమే లేదా? అడిగింది మళ్ళీ.

నీకు అంత ఆసక్తి ఎందుకు చెప్పు? అన్నాడతను.

నిన్ను చూస్తే అమ్మాయిలను ఇట్టే పడేసేవాడిలా కనిపిస్తావ్. ఎంతమంది అమ్మాయిలను పడేశావో తెలుసుకుందామని...

టీనేజ్‌లో మాత్రం ఓ అమ్మాయిని దేవదాసు పార్వతిని ప్రేమించినట్లుగా ప్రేమించాను అని జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి అందులోంచి కింగ్‌సైజ్ గోల్డ్‌ఫ్లాక్‌ను పెదవుల మధ్య పెట్టి అగ్గిపెట్టె తీసి అంటించాడు. గట్టిగా పొగ లాగి వదిలాడు.

నువ్వు సిగరెట్ తాగుతుంటే చాలా స్టయిల్‌గా ఉంటుంది అంది వసుంధర ఒక గడ్డిపరకను పీకి దాంతో అతని చేయి మీద రాయడం మొదలుపెడుతూ.

ఈ సిగరెట్ ఆమె జ్ఞాపకార్థమే తాగుతున్నాను. కానీ, నేను దేవదాసును కాలేదు. ఆమె పార్వతీ కాదని తేలిపోయింది అన్నాడు.

మరే అమ్మాయితోనూ ఆ తర్వాత ప్రేమలో పడలేదా?


అది ప్రేమో కాదో తెలీదు. అసలు నాకు ప్రేమ అనే దాని మీద నమ్మకంలేదు. కానీ, ఓ అమ్మాయిని చాలా ఇష్టపడ్డాను. అంతే ఇష్టం నాకు మా మేడమ్ మీద కూడా ఏర్పడింది. నేను ఆ అమ్మాయిని ఇష్టపడుతుంటే మరో అమ్మాయి నా చుట్టూ తిరుగుతుండేది. నన్ను నిత్యం కనిపెట్టుకుని ఉంటున్న ఈ అమ్మాయిని ఆ అమ్మాయి మోజులో పడి విస్మరించడం ఇప్పుడు గుర్తొస్తే బాధనిపిస్తుంది అని ఓ నిట్టూర్పు విడిచాడు.

ఏ అమ్మాయితోనూ సెక్సువల్ రిలేషన్స్ లేవా? అడిగింది

లేవంటే నమ్ముతావా? మా ఆవిడ తప్ప నాకు మరో స్త్రీతో ఇప్పటివరకు సెక్సువల్ రిలేషన్ లేదు. పెట్టుకోకూడదని కూడా ఏం లేదు. కానీ, నాకు అక్కర్లేదు. నన్ను ప్రేమించి నా నుంచి ఏమీ ఆశించని స్త్రీ కావాలి అన్నాడు.

నీతో దగ్గరగా ఉన్న అమ్మాయిలనెప్పుడూ ట్రై చేయలేదా? అడిగింది వసుంధర.

చేద్దామని అనిపించేది కానీ నేను వారి నుంచి సెక్స్‌ను ఆశిస్తున్నానని తెలిసిపోతే నాకు ఎప్పటికీ దూరమవుతారేమోననే భయం ఉండేది. వారిని ఆ రకంగా దూరం చేసుకోవడం కన్నా, ఫ్రెండ్స్‌గా ఎల్లకాలం ఉండటం మంచిదనిపించేది అని వివరించాడు.



అయితే, నీతో జాగ్రత్తగా ఉండాలి అంది.

తన ప్రేమ వ్యవహారాల గురించి, అమ్మాయిలతో సంబంధాల గురించి ఒక అమ్మాయి అడుగుతుంటే ఉత్సాహంగా ఉంది. ఈ విషయాలను అతను ఎన్నోసార్లు ఫ్రెండ్స్‌తో మందు తాగినప్పుడు చాలాసార్లు చెప్పాడు. ఆ అమ్మాయిలకు తనంటే ఎంత అభిమానమో కూడా చెప్పాడు. వారెంత అందంగా ఉంటారో, తనతో ఎంత సన్నిహితంగా ఉండేవారో పూసగుచ్చినట్లు చెప్పాడు. అప్పుడు కలగనంత ఆనందం ఒక అమ్మాయితో ఆ విషయాలు చెప్తూ పొందగలిగాడు.

మీ ఆవిడంటే నీకు చాలా ఇష్టమనుకుంటా అంది అర్థోక్తిగా.

నన్ను ఇష్టపడి చేసుకుంది. నాకు పెళ్ళి మీద ధ్యాస లేనప్పుడు మా పెద్దల వత్తిడితో ఆ అమ్మాయిని చూశాను. ఒక అమ్మాయిని చూసింత్తర్వాత బాగా లేదని, చేసుకోనని చెప్పడం మంచిది కాదనిపించింది. నేనిప్పుడు పెళ్ళి చేసుకోనని మాత్రం చెప్పాను. అయినా వినలేదు. ఆమె నన్నే పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టి కూర్చుందట. దాంతో ఆమె అన్నయ్యలు నన్ను వదలలేదు. నేను ఇష్టపడినవారు నన్ను కాదనప్పుడు నన్ను ఇష్టపడిన అమ్మాయిని చేసుకోవాలనిపించింది అంటూ చెప్పాడు.

ఆమె నిన్ను ప్రేమించిందా? నువ్వు ఆమెను ప్రేమించావా? అడిగింది.

అది ప్రేమో కాదో తెలీదు. ఆమెను మా వాళ్ళెవరూ పట్టించుకోరు. వాళ్ళ అన్నయ్యలూ పట్టించుకోరు. నా ఇద్దరు పిల్లలతోపాటు ఆమెనూ ఒక పిల్లలా నేను పెంచుకుంటూ వస్తున్నా అని సమాధానమిచ్చాడు.

సరే వెళ్దామా అంటూ లేచి చీర దులుపుకుంది. అతనూ లేచాడు. రోడ్డు మీదికి వచ్చి బైక్ స్టార్ట్ చేశాడు.

ఆమె వెనుక కూర్చుంది. ఆమె ఎత్తయిన వక్షోజాలు వీపును రాసుకుంటుంటే గిలిగింతలు పెట్టినట్లుంది. మనసు ముందుకూ, వెనక్కూ ఊగిసలాడుతోంది. అతనికి 35 ఏళ్ళుంటాయి. మీసాలు అక్కడక్కడా నెరిసాయి. ఆమెకు 37 ఏళ్ళదాకా ఉంటాయి. కానీ 30 ఏళ్ళ ప్రౌఢలా ఉంటుంది. పెళ్ళి కాలేదు. జుట్టుకు నల్ల రంగు వేస్తుంది. మగవాళ్ళను అట్టే ఆకర్షించగల అవయవ సంపద ఆమెది.

సీతారాంకు నువ్వంటే ఎంత ప్రేమో అన్నాడు రాజీవ్. నువ్వెట్లా కనిపెట్టావని అడిగా. ఆ కళ్ళలో నీ పట్ల ఆప్యాయత కనిపిస్తుందని అన్నాడు అంది కుడిచేయి నడుం మీద వేస్తూ.

అతను ఈ లోకంలో లేడు. ఒక అమ్మాయి అంత ఫ్రీగా తనతో వుండటం ఇదే మొదటిసారి. చాలామంది అమ్మాయిలు అతనికి తెలుసు. అందులో కనీసం ఇద్దరు ముగ్గురి మీదనైనా అతనికి ఆసక్తి ఉంది. కానీ, ఎందుకో గానీ మిగతా వాళ్ళతోకన్నా వాళ్ళతోనే అతను దూరంగా ఉండేవాడు. అతడు మాట్లాడలేదు.

నన్ను ప్రేమిస్తున్నావా? అని అడిగింది.

ప్రేమ మీద నాకు నమ్మకంలేదు. కానీ నువ్వంటే నాకు ఇష్టం అన్నాడు.

ఇష్టం ప్రేమ కాదా? అంది.

అది నేను చెప్పలేను

ఆమె ఉండే గది వచ్చేసిదం. మరో ఫ్రెండ్‌తోపాటు ఆమె ఆ గదిలో ఉంటోంది. బైక్ ఆపి వెళ్తానని చెప్పాడు సీతారాం.

లోపలికి రాకూడదూ? అంది.

బైక్ ఆపి ఆమెతోపాటూ లోపలికెళ్ళాడు. తాళం తీసింది. ఆమె వెనుకే లోనికెళ్ళాడు. నాకు చాలా ఇష్టమైన వాళ్ళను

మాత్రమే లోపలికి పిలుస్తా. రాజీవ్, శంకర్, నానీ మాత్రమే నా గదికి వస్తారు అంది. అతని గుండె ఎగిరి గంతేసింది.

రాజీవ్, శంకర్ తెలుసు. నానీ ఎవరు? అడిగాడు.

అతను నాకు అత్యంత ఆప్తుడు. నన్ను కంటికి రెప్పలా కాపాడుతుంటాడు అంది.

అతను ఆమె గదికి వెళ్ళడం నిత్యకృత్యంగా మారింది. తాను ఆమె నుంచి ఏమి ఆశిస్తున్నాడో అతనికే స్పష్టంగా తెలీదు. అతనికి ఇతర స్త్రీల మీద ఆసక్తి ఉన్నప్పటికీ తన భార్యను కాదని సెక్సువల్ రిలేషన్స్ పెట్టుకునే దాకా వెళ్ళలేదు. కానీ, నానీ ఎవరో తెలుసుకోవాలనే ఆసక్తి అతనిలో పెరిగింది. ఈ అమ్మాయి అంతగా ఇష్టపడే ఆ నానీ ఎలా ఉంటాడో చూడాలనిపించేది. ఆమె ప్రేమకథలు కొన్ని విన్నాక తాను ఆశిస్తున్న వ్యక్తిత్వానికి తన ఊహా ప్రపంచంలో ఒక రూపం కల్పించి ఆరాధిస్తుందేమోనని అనుకోసాగాడు. ఆమె ప్రేమించిన పురుషులెవరికీ తాను ఆశిస్తున్న వ్యక్తిత్వం లేదేమో అని కూడా అనుకోసాగాడు.

భార్యాభర్తల మధ్య ప్రేమలుండవు. వ్యాపార సంబంధాలే ఉంటాయి కదా! అంది ఒకసారి స్త్రీవాదంపై చర్చ సందర్భంగా.

చాలా మటుకు కావచ్చు అన్నాడు.

భద్రత కోసమే భార్యలు భర్తలను అంటిపెట్టుకుని ఉంటారు గానీ ప్రేమతో కాదు అంది.

అది సంపూర్ణ వాస్తవం కాదేమో! అన్నాడతను.

నీదంతా అబద్ధం అంది.

మా ఇంటికి ఓసారి రాకూడదూ? అడిగాడు.

మీ ఆవిడ ఏమీ అనుకోదా? అంది.

అనుకోవడానికేముంది? అని ఎదురుప్రశ్న వేశాడు.

★ ★ ★

ఓ రోజు తనతో ఇంటికి తీసుకెళ్ళాడు. రాత్రి భోజనం చేసే వరకు వసుంధర, సీతారాం భార్య శశికళతో కబుర్లు చెప్తూనే ఉంది. వాళ్ళిద్దరూ మంచి ఫ్రెండ్సయ్యారనిపించింది అతనికి. నిజానికి శశికళ ఎవరితోనైనా ఇట్టే కలిసిపోగలదు. ముగ్గురూ కలిసి పేకాట ఆడారు. ఎప్పుడో అర్ధరాత్రి వసుంధరకు పిల్లలతోపాటు బయటి గదిలో పరుపు వేసి పడుకోమని చెప్పి బెడ్‌రూంలోకి సీతారాంను తీసుకొని వెళ్ళింది శశికళ. తెల్లారి అతను లేచి చూసేసరికి బయట వరండాలో తిరుగుతూ కనిపించింది వసుంధర. కళ్ళు జ్యోతుల్లా ఉన్నాయి. నిద్ర పట్టలేదా? అని అడిగాడు. ఆమె మాట్లాడలేదు. అంతటితో సంభాషణ ఆపేశాడు. వెళ్తానని బయల్దేరింది వసుంధర. ముఖం కడుక్కుని టీ తాగమని శశికళ బతిమలాడినా వినలేదు. హ్యాండ్‌బ్యాగ్ తీసుకుని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయాక - ఏమిటీ? ఈ అమ్మాయి అలా వెళ్ళిపోయింది? అడిగింది సీతారాంను అతని భార్య.

ఏమో? అన్నాడతను.

ఈ సంఘటన జరిగిన తర్వాత వసుంధరలో అశాంతి పెరిగినట్లనిపించింది సీతారాంకు. ఆఫీసు కెళ్ళడంలేదు. అతను పెద్దగా పట్టించుకోలేదు. ఓ రోజు సాయంత్రం ఫోన్ చేసి ఈ రోజు తప్పకుండా నా గదికి రా! అని చెప్పింది వసుంధర. సీతారాం వెళ్ళి చాలాసేపు కూర్చున్నాడు. ఇంతకుముందు గలగల మాట్లాడే వసుంధర ఆ రోజు చాలా సమయం మౌనానికే కేటాయించింది.

ఇక కూర్చునే ఓపిక లేక, ఇంట్లో తన కోసం శశికళ ఎదురుచూస్తుంటుందనే ఉద్దేశంతో నే వెళ్తాను అని లేచాడు.

ఆమె అతని వైపు జాలిగా చూసి రూమ్‌లో నాకు బోర్‌గా ఉంది. నా ఫ్రెండ్ కూడా లేదు. ఈ రోజు రానని చెప్పింది అంది.

మా ఇంటికి రాకూడదూ? అడిగాడు.

రాను

ఎందుకని?

మీ ఆవిడతోపాటు నువ్వు పడుకుంటే నాకు నిద్రపట్టదు

నేను నీకు చాలాసార్లు చెప్పాను. నేను నా ఫ్యామిలీని వదిలిపెట్టి ఉండలేనని. నీతో నాకు సెక్స్ అవసరం లేదని అన్నాడు. అంతేనా? నేనేమీ కానా? నీకు ఫ్రెండ్స్ ఉన్నారు. ఉద్యోగం ఉంది. నీ వ్యవహారాలు నీకున్నాయి. స్వతంత్ర అభిప్రాయాలున్నాయి. నేను నీతో వుంటానని నేను చెప్పలేదు. నువ్వు అలా అనుకుంటావని నేను భావించలేదు.



అతను మాట్లాడలేదు.

నన్ను నీ దగ్గర పడుకోనిస్తానంటే వస్తా అని గలగలా నవ్వింది. జోక్ చేసిందనుకున్నాడు సీతారాం.

ఆమె లేచి నిలబడి అతనికి ఎదురుగా వచ్చి ఆమె పెదవులతో అతని పెదవులను ఆనించి గట్టిగా ముద్దు పెట్టుకుంది. అతను నిరుత్తరుడయ్యాడు. కాస్త వెనక్కి జరిగి - సీతారాం! నేనంటే నీకు ప్రేమ కదూ! అంది.

అతను మాట్లాడలేదు. మళ్ళీ ఆమె ముద్దుపెట్టుకుంది. ఈసారి వెంటనే వదలలేదు. అతని ప్రతి అణువును తడమసాగింది. సీతారాంకు ఒళ్ళు తేలికయినట్లనిపించింది. ఎక్కడో తేలియాడుతున్నట్లుంది. ఆమె అతడ్ని వదిలిపెట్టింది. అతడు తన రెండు చేతులూ ఆమె నడుం చుట్టూ వేసి గట్టిగా పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు. వెనక్కి జరిగి - నే వెళ్తా అన్నాడు.

వద్దు

వెళ్ళకపోతే ఎలా?

మీ ఆవిడంటే నీకంత భయమా?

నా కోసం ఎదురుచూస్తుంటుంది

నాతో వుండిపోరాదూ, ఈ ఒక్క రాత్రికి

ఉండలేను

నీదంతా స్వార్థం. నువ్వు వెళ్ళి మీ ఆవిడ ద్వారా కోరిక తీర్చుకుంటావు. నాకూ కోరికలుంటాయి కదా!

పెళ్ళి చేసుకోకూడదూ!

రాజీవ్ కూడా ఇదే మాటంటాడు. మీ ఇద్దరికి నన్ను ఎప్పుడు వదిలించుకుందామా అని వున్నట్లుంది

నే వెళ్తా అని మరోసారి చెప్పి కదలబోయాడు. రెండు చేతులూ అతనికి అడ్డంగా పెట్టింది. అతను కూర్చున్నాడు. ఆమె అతడ్ని మెల్లమెల్లగా ఆక్రమించింది.

నా కోసం ఈ మాత్రం చేయలేవా సీతారాం! అంది మత్తుగా. అతను లొంగిపోయాడు. అతను మాట్లాడలేదు.

నా కోసం ఈ మాత్రం త్యాగం చేయలేవూ అడిగింది.

ఇందులో నా త్యాగమేం ఉంది అన్నాడతను. ఆ రోజు అతను స్వర్గసౌఖ్యం అనుభవించాడు. ఇంతకుముందులాగా ఇద్దరి మధ్య వివిధ విషయాల మీద చర్చలు జరగడంలేదు. సంభాషణలు తగ్గాయి. ఇద్దరు కలిశారంటే ఇతర విషయాలన్నీ పక్కకుపోయి శారీరక సుఖమే ప్రధానమవుతున్నాయి.

★ ★ ★

రాత్రి ఎనిమిది గంటలు. సీతారాం బెడ్ మీద కూర్చున్నాడు. వసుంధర మరో పక్క కూర్చుంది. అతను రాగానే మీద పడిపోయే వసుంధర అలా దూరంగా ఉండటం అతనికి ఆశ్చర్యమేసింది. ఏమో జరిగి ఉంటుందని అనుకున్నాడు. ఏమైంది? అని అడిగాడు. ఆమె మాట్లాడలేదు. దాంతో దగ్గరికి వెళ్ళి ముద్దు పెట్టుకోబోయాడు. విదిలించి కొట్టింది. గడ్డం పట్టుకుని చెప్పకుంటే ఎలా తెలుస్తుంది? అన్నాడు.

నాతో కోరిక తీర్చుకోవడానికే వస్తున్నావని అనిపిస్తోంది. వెంటనే వెళ్ళిపోతున్నావు.

నేను నీకు చాలాసార్లు చెప్పాను. నేను నా ఫ్యామిలీని వదిలిపెట్టి ఉండలేనని. నీతో నాకు సెక్స్ అవసరం లేదని అన్నాడు.

అంతేనా? నేనేమీ కానా?

నీకు ఫ్రెండ్స్ ఉన్నారు. ఉద్యోగం ఉంది. నీ వ్యవహారాలు నీకున్నాయి. స్వతంత్ర అభిప్రాయాలున్నాయి. నేను నీతో వుంటానని నేను చెప్పలేదు. నువ్వు అలా అనుకుంటావని నేను భావించలేదు.

నీ కోరిక తీర్చుకుని వెళ్ళిపోతున్నావు

నన్నేం చేయమంటావు?

ఇక్కడే వుండు

నా వల్ల కాదని చాలాసార్లు చెప్పా

స్వతంత్రంగా బతకగలిగే వసుంధరనే ఇలా అంటుంటే శశికళ పరిస్థితి ఎలా ఉంటుందని అనుకున్నాడు. వసుంధరతో పరిచయమయ్యాక సమాజంతో సంబంధం తెగిపోయినట్లుగా ఉంది. మరో మనిషిని కలవడంలేదు. ఫ్రెండ్స్‌నెవరినీ కలవడంలేదు. ఎక్కడికి వెళ్ళాలన్నా వసుంధరకు చెప్పాల్సి వస్తోంది. తన పనులకు మాత్రం సీతారాం తప్పనిసరిగా అటెండ్ కావాల్సి వస్తోంది. ఒకరోజు తన ఫ్రెండ్ రాకేష్ ఇంట్లో ఫంక్షన్ ఉంది. ఇద్దరం కలిసి వెళ్దామంటే రాననందుకు పెద్ద గొడవ చేసింది. నీ ఫ్రెండ్ కదా నువ్వు వెళ్ళు. నేనెందుకు? అన్నాడతను. ఆమె వినలేదు. నానా రభస చేసింది. అయినా, మొండిగా అతను అందుకు నిరాకరించాడు. ఆమె కూడా వెళ్ళలేదు. అతనివల్ల తాను వెళ్ళలేకపోయినందుకు వసుంధర పది రోజులు సాధించింది. తాను రాజీవ్‌నో, మరెవరినో కలవాలను కున్నప్పుడు సీతారాం అనుమతితో సంబంధం లేకుండా వెళ్ళిపోయేది. సీతారాం ఇవేమీ పట్టించుకోలేదు. ఆమె జీవితం ఆమెదనుకున్నాడు. ఆమె నిలదీయడం ప్రారంభించేసరికి ఇవన్నీ గుర్తుకొచ్చాయి.

నేను చచ్చిపోతా అంటూ ఆవేశంగా వెళ్ళి గ్యాస్ స్టౌ అంటించింది. ఆమెను ఆపి, శాంతపరచడం సీతారాంకు గగనమే అయింది. తెల్లారింది. విపరీతంగా అలసిపోయినట్లనిపించింది. తన మీద తనకే అసహ్యం లాంటిది పుట్టింది. తాను వెళ్ళడానికి లేస్తే నువ్వు వెళ్తే నేను చచ్చిపోతా అని బెదిరించింది. అవేవీ లెక్కచేయకుండా అతను విసవిసా బయటకు వచ్చి ఇంటిదారి పట్టాడు. ★